క్లుప్తంగా

విష్ణాలయంలో పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత విష్ణాలయంలో ఏకాదశ పూజలను గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. సుప్రభాత సేవ జరిపారు. అనంతరం ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు దామిశెట్టి బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆశ్రమంలో పండ్ల పంపిణీ



కొడవలూరు: మండలంలోని రామాపురానికి చెందిన పొన్నూరు ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా టపాతోపులోని విశ్వజనని అనాథ ఆశ్రమంలో బాలబాలికలకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్, వినయ్, కిశోర్, చందు, సాయి, సంతోష్, బాబ్జి పాల్గొన్నారు.

బాబా మందిరంలో పల్లకి సేవ



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి పల్లకి సేవ జరిగింది.

కార్మికులకు బెనిఫిట్స్ కల్పించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నేతలు

నెల్లూరు(బారకాసు): 60 సంవత్సరాలు నిండిన మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నాలుగో రోజైన గురువారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నందిపాటి మాలకొండయ్య, పి.సూర్యనారాయణ మాట్లాడుతూ 60 సంవత్సరాల వయసు నిండిందంటూ కార్మికులకు ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, పనులకు ఆపడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించి, బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ పొట్లూరి స్రవంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, మున్సిపల్ నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నాయకులు ఎండీ గయాస్, కామాక్షమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ, శ్రీనివాసులు, సలోమి, బుజ్జమ్మ, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై నృసింహుడు



నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహకొండలో ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి గురువారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గోపి, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఎడగారు వరినాట్లకు సన్నద్ధం

- 2 వేల ఎకరాల్లో నాట్లు పడే అవకాశం
- పెన్నార్ డెల్టాలో అధికం

పొదలకూరు: మండలంలోని పెన్నార్ డెల్టా, నాన్ డెల్టా పల్లెల్లో రైతులు ఎడగారు వరినాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని గ్రామాల్లో నార్లు పోసుకుంటున్నారు. మండలంలో పంటల సాగు ప్రత్యేకంగా ఉంటుంది. మొత్తం 30 పంచాయతీలుండగా నీటి లభ్యత ఉన్నచోట్ల ఎడగారు పండిస్తారు. తాటిపర్తి, విరువూరు, సూరాయపాళెం, మహ్మదాపురం, నేదురుమల్లి, వెలికంటిపాళెం, డేగపూడి, పెదరాజుపాళెం, నావూరు తదితర గ్రామాల్లో కేఎస్‌ఎం 1630 రకం వరిని ఎడగారులో సాగు చేస్తారు. అయితే రబీలో అధికంగా సాగు చేసిన ఆ రకం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. దిగుబడి కూడా బాగా తగ్గడంతో ఆ రకం నార్లు పోసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడగారులో సోమశిల ప్రాజెక్ట్ నుంచి నాన్‌డెల్టాకు సైతం కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు వరినాట్లు అనుకున్న విస్తీర్ణం కంటే అదనంగా సాగు చేసే అవకాశం ఉంది. 2 వేల ఎకరాల నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి పెరిగే అవకాశం కూడా లేకపోలేదంటున్నారు. సోమశిల దక్షిణ కాలువకు నీటిని విడుదల చేస్తే మండలంలో నాట్లు పెరుగుతాయని అంటున్నారు.

గిట్టుబాటు కాని ధరలు

రబీలో పండించిన వరి ధాన్యానికి రైతులకు గిట్టుబాటు ధరలు లభించలేదు. దీనికితోడు కొనుగోలు



పెదరాజుపాళెంలో ఎడగారు వరినాట్లు (ఫైల్)

కేంద్రాల ద్వారా రైతులు విక్రయించిన ధాన్యం కూడా చాలా తక్కువ. మిల్లర్లు, దళారుల వల్ల ఇబ్బందులు పడటంతోపాటు ధాన్యంకు ధరలు లభించక నష్టపోయారు. రబీలో పండించిన ధాన్యాన్ని చాలామంది ఆరబెట్టుకుని భద్రపరుచుకున్నారు. ఇప్పటికీ 25 శాతం మంది ధాన్యాన్ని దాచుకున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే సీజన్‌లో పండే ధాన్యానికి ధరలు గిట్టుబాటు అవుతాయా? లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందా? అని అన్నదాతలు ఆలోచిస్తున్నారు. దీనికితోడు ఎడగారులో సాధారణంగా వరి దిగుబడి తగ్గుతుంది. రబీ సీజన్లో పోల్చుకుంటే ఎకరాకు పుట్టి వరకు ఎడగారు సాగులో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పెట్టుబడులు మాత్రం అమాంతం పెరిగిపోయి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.33 వేల వరకు భరించాల్సి వస్తోంది.

కండలేరు నుంచి నీరు విడుదల

కండలేరు జలాశయం నుంచి ఎడమగట్టు కాలువకు తెలుగు గంగ అధికారులు హైలెవల్ స్లూయిజ్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. మెట్టపంటలు, నిమ్మ, సవక, జామాయిల్ సాగు చేసుకునే రైతులకు కాలువ నీరు ఉపయోగపడుతుంది. 80 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేసినట్టు అధికారులు వెల్లడించారు.

థర్మల్ విద్యుత్ కేంద్రంలో మాక్‌డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదలకూరు(ముత్తుకూరు): ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదర సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో గురువారం ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు దీనిని చేపట్టారు. ప్లాంట్ ఆవరణలో బాంబుల దాడి జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?, క్షతగాత్రులను వైద్య సేవలకు కోసం ఎలా తరలించాలి? తదితర అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసులు, తహసీల్దార్, ఎంపీడీఓ, జెన్‌కో సీఈఓ, పోర్ట్ సీఐ, ఎస్సై, ఫైర్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తోటపల్లిగూడూరు: మండలంలోని పేడూరు యూనిట్ మల్లికార్జునపురం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలను వివరించారు. ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దానయ్య, విలేజ్ కమిటీ సభ్యులు సునీత, కల్పన, గ్రామస్తులు జీవరత్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

కోవూరులో లేగదూడల ప్రదర్శన

కోవూరు: కోవూరులో లేగదూడల ప్రదర్శనను గురువారం నిర్వహించారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉపసంచాలకుడు శ్రీనివాసరావు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు లేగ దూడలను సంరక్షించుకుని మేలుజాతి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కాగా పోటీల్లో మొదటి బహుమతిగా అత్తిపల్లి గోవింద్‌రెడ్డి దూడను, రెండో బహుమతిగా పొబ్బారెడ్డి మల్లికార్జున్‌రెడ్డి దూడ, మూడు, నాలుగో బహుమతిగా వంటేరు శ్రీనివాసులురెడ్డి, ఇంతా శ్రీకాంత్‌రెడ్డి దూడలను



ఎంపిక చేశారు. కోవూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ కృష్ణమౌర్య, వివిధ మండలాల పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సేవకు మారుపేరు రెడ్‌క్రాస్

నెల్లూరు(అర్బన్): సేవకు మారుపేరుగా రెడ్‌క్రాస్ సొసైటీ నిలుస్తోందని ఆ శాఖ జిల్లా కోశాధికారి సురేష్‌కుమార్ జైన్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఉద్యమానికి కారణమైన హెన్రీడ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మానవత్వం చాటేలా వలంటీర్లు, సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య మాట్లాడుతూ 15 ప్రాజెక్టులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు మజ్జిగ, తాగునీరు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంసీ



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నేతలు

మెంబర్ రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్, సాయిరామ్ పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

నెల్లూరు(అర్బన్) : తూనికలు, కొలతలకు సంబంధించి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఇసాక్ తెలిపారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులకు తూనికలు, కొలతలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు బరువు, తూకాలు, కొలతల నిబంధనలు, సరైన ప్రమాణ పరికరాల వినియోగం గురించి వివరించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఆశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్, సేటెల్ కంపెనీ నుంచి నాగేశ్వరరావు, కోశాధికారి గఫూర్ పాల్గొన్నారు.



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వివరాలు నమోదు చేసుకోవాలి

పొదలకూరు: 2025 – 26 సంవత్సరానికి సంబంధించి అన్నదాత సుఖీభవ పథకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినట్టు ఏఓ వాసు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతులు ఆధార్, భూమి వివరాలతో రైతు సేవా కేంద్రం సహాయకులను కలిసి వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

⇨ కొడవలూరు/కోవూరు : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల గుర్తింపు ప్రక్రియ అన్ని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతోందని ఏఓ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఏఏల లాగిన్‌లో పొందుపరిచిన రైతుల జాబితాలను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నెలకు రూ.పది వేలు అంత కంటే ఎక్కువ పెన్షన్ పొందే వారిని అనర్హులుగా గుర్తిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఈనెల 17 నుంచి జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆలయ టూరిజం హాల్లో గురువారం సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

కొరుటూరులో బైక్ చోరీ

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరుకు చెందిన రంతుల్లా పల్సర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారు. రంతుల్లా రోజులాగే బైక్‌ను ఇంట్లో ఉంచి మిద్దెపైన నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గత నెల కూడా గ్రామంలో ఓ పల్సర్ బైక్, అంతకు ముందు మరో పల్సర్ బైక్ అపహరణకు గురైంది. ఎప్పుడూ లేనివిధంగా వరుసగా పల్సర్ బైక్‌లు చోరీ కావడం చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్‌కు అవార్డు



నెల్లూరు(అర్బన్): రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆనంద్‌కు అవార్డు వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ దీనిని అందజేశారు.

రేగడిచెలికలో టీడీపీకి భారీ షాక్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో చేరికలు

కొడవలూరు: మండలంలోని రేగడిచెలికలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీకి చెందిన పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని టీడీపీ నేతలు బత్తల కమల్ తేజా యాదవ్, కటారి భానుయాదవ్, డబ్బుకొట్టు నాగార్జునయాదవ్, డబ్బుకొట్టు నానియాదవ్‌లు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు దేవనబోయిన శివకుమార్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో గురువారం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ పార్టీలో చేరే వారికి తామంతా అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీని వీడుతున్నారంటే ప్రభుత్వంపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవనబోయిన నాగేంద్ర, నల్లావుల నరేష్, చెముకుల హజరత్, బక్కముంతల శ్రీనాథ్, ముచ్చు వంశీలు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు వేస్తే లైసెన్సులు రద్దు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చేపలు, రొయ్యల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేసి పెంచితే సంబంధిత రైతుల లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీ చాన్‌బాషా అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కార్యక్రమంపై ఆక్వా రైతులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా సాయం, సబ్సిడీ అందిస్తామన్నారు. చికెన్ వ్యర్థాలు వేసి చేపలు పెంచితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్‌డీఓ



మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ చాన్‌బాషా

పొట్టియ్య, మత్స్యశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొడవలూరు: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో బాలబాలికలకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో బాలికలు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరచడం వేసవి శిక్షణా శిబిరాల లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ప్రసన్నుని బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి (శివాలయం) బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి స్వామివారికి సింహ వాహనోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. ఉభయకర్తలుగా పుట్టా బాలాజీ – నీలిమ దంపతులు వ్యవహరించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. శుక్రవారం స్వామివారికి పులివాహనోత్సవం జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో శివాలయం

రోలర్ స్కేటింగ్‌లో ఉచిత శిక్షణ

నెల్లూరు(బృందావనం) : ఆదిత్య నగర్ చిల్డ్రన్స్‌పార్క్‌లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి రోలర్ స్కేటింగ్ శిక్షణా తరగతులు జరుగనున్నాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, కె.కామేష్ గురువారం తెలిపారు. శిక్షణకు 6 నుంచి 16 ఏళ్లవారు అర్హులన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షకులు విశ్వనాథ్ (94400 59500), షౌఖత్‌అలీ (80192 23661) నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేసవిలో కూల్‌కూల్‌గా..

- తాటిముంజలకు భలే గిరాకీ
- మెండుగా పోషకాలు
- నగరంలో విస్తృతంగా విక్రయాలు

నెల్లూరు(బారకాసు): తాటి ముంజలు వేసవి సీజన్లో మాత్రమే దొరికే పల్లెటూరి మధురాలు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్, కొబ్బరి బోండాలు ఉన్నా ముంజలదే మొదటి స్థానం. సూర్యప్రతాపాన్ని తట్టుకునేందుకు మానవునికి కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా ఉండటంతో దీనికి భలే గిరాకీ ఏర్పడింది. వీటిపై ప్రజలు ఆసక్తి చూపడంతో ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాటిచెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి తాజాగా అప్పటికప్పుడు కాయలు కొట్టి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. గతంలో చాలా తక్కువ ధరకు లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలాల గట్లపై వరుసగా తాటి చెట్లు కనిపించేవి. ఇప్పుడు ఎక్కడో కొన్ని ప్రాంతాల్లోనే దర్శనమిస్తున్నాయి.

జోరుగా..

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, సంతపేట, చిన్నబజార్, మినీబైపాస్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు సెంటర్ తదితర ప్రాంతాల్లో తాటి ముంజలను విక్రయిస్తున్నారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాలైన రాజుపాళెం, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, బుచ్చి, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి గ్రామీణులు తాటి ముంజలను నగరంలోకి తీసుకొచ్చి విక్రయిస్తూ అనేక పేద కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పోషక విలువల్లో మేటి

వంద గ్రాములు తాటి ముంజలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాములు కార్బోహైడ్రేట్లు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 0.061 గ్రాముల ఆమ్లం, 12 మి.లీల కాల్షియం, 21 మి.లీల పాస్పరస్, 0.2 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటాయి. సీజన్‌లో దొరికే తాటిముంజలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు.



నెల్లూరులో తాటిముంజల విక్రయాలు